# నల్లగొండ నుంచి భువనగిరికి సెమీ డీలక్స్ బస్సు



నల్లగొండ డిపోకు వచ్చిన సెమీ డీలక్స్ బస్సు

నల్లగొండ సిటీ సెప్టెంబరు 17 : ప్రయాణికుల సౌకర్యార్థం నల్లగొండ డిపోకు ప్రత్యేక సెమీ డీలక్స్ బస్సును కేటాయించినట్లు ఆర్ఎం రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సును నల్లగొండ నుంచి భువనగిరికి బుధవారం నుంచి నడుపనున్నట్లు పేర్కొన్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం ఒక బస్సును కేటాయించారని, మరో నాలుగు బస్సులు గురువారం రానున్నట్లు తెలిపారు. సెమీ డీలక్స్ బస్సులో మహాలక్ష్మి పథకం వర్తించదని చెప్పారు.

నమస్తే తెలంగాణ

సూర్యాపేట

5 | నల్లగొండ, బుధవారం 18 సెప్టెంబర్ 2024 | SURYAPET


సూర్యాపేట కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఆవిష్కరించి గీతాలాపన చేస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

# రేవంత్ సర్కారుపై నిరసనల వెల్లువ

తెలంగాణ తల్లిని అవమానించడంపై మండిపాటు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం

## సచివాలయంలో రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడం పట్ల ఆందోళన

**రాష్ట్ర సచివాలయానికి ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహానికి బదులుగా రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసన వ్యక్తం చేశారు. మంగళ వారం తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. రేవంత్ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య, దేవరకొండలో ఆ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, నకిరేకల్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి పలుచోట్ల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.**


సూర్యాపేటలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నిరసన తెలుపుతున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, చిత్రంలో మున్సిపల్ చైర్మన్ అన్నపూర్ణ తదితరులు


కోదాడ పట్టణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు


మద్దిరాల : మండల కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎస్‌ఏ రజాక్, ఆ పార్టీ నాయకులు

## సచివాలయంలో రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటు తెలంగాణ ప్రజలను అవమానించడమే

**బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్**

బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 17 : తెలంగాణ రాష్ట్రం పేరు ఎత్తితే తుపాకులతో కాల్చి చంపుతామన్న వారే నేడు సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి బదులు రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, ఇది తెలంగాణ ప్రజలను అవమానించడమేనని బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. సచివాలయంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పిలుపు మేరకు మంగళవారం బీఆర్ఎస్ శ్రేణులు సూర్యాపేట పట్టణంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బడుగుల మాట్లాడుతూ తెలంగాణ పేరు ఉచ్చరించని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గెలిపించడం తెలంగాణ ప్రజలు చేసుకున్న దురదృష్టమన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను పదేండ్లు అన్ని వర్గాల ఆమోదంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి చేశారని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధిలో భాగంగా సచివాలయం, అమరజ్యోతి, అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆ ప్రాంతాన్ని పెద్ద కూడలిగా మార్చారని చెప్పారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టాల్సి ఉండగా రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టడం తెలంగాణ సమాజాన్ని అవమానించడమే అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలీసుల అండతో చేస్తున్న దుందుడుకు రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సవరాల సత్యనారాయణ, బూర బాలసైదులు, నాయకులు వల్దాస్ జానీ, ఆకుల లవకుశ, గండూరి కృపాకర్, మొరిశెట్టి శ్రీనివాస్, సల్మా మస్తాన్, రియాజుద్దీన్, అనంతుల దుర్గాప్రసాద్, పూర్ణ శశికాంత్, బత్తుల రమేశ్, షకీల్, కరుణశ్రీ, సయ్యద్ పాల్గొన్నారు.

# అసమాన త్యాగాల ఫలితమే నేటి స్వేచ్ఛా తెలంగాణ

- ఘనంగా ప్రజా పాలన దినోత్సవం
- జాతీయ జెండాను ఆవిష్కరించిన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్
- అమరవీరులకు నివాళి.. సాయుధ పోరాట యోధులకు సన్మానం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సూర్యాపేట, సెప్టెంబర్ 17 : ఎందరో మహనుభావులు ఈ గడ్డ మీద చేసిన అసమాన త్యాగాల ఫలితమే నేటి స్వేచ్ఛా తెలంగాణ అని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీసీ కమిషన్ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. తెలంగాణ అమరులకు నివాలర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. దేశమంతా 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య సంబురాల్లో కేరింతలు వేస్తుంటే హైదరాబాద్ సంస్థానం ప్రజలు మాత్రం స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం పోరాటడుతూనే ఉన్నారని గుర్తు చేశారు. సర్దార్ వల్లాభాయ్ పటేల్ సారథ్యంలో 1948 సెప్టెంబర్ 13న ప్రారంభమైన ఆపరేషన్ పోలోతో సెప్టెంబర్ 17న నిజాం నవాబు హైదరాబాద్ సంస్థానాన్ని భారతావనిలో విలీనం చేశారని తెలిపారు. స్వరాష్ట్రంగా ఉన్న హైదరాబాద్‌ను కొంతమంది కుట్రపూరితంగా ఆంధ్రప్రదేశ్‌లో కలిపారని, ఆ తర్వాత ప్రత్యేక తెలంగాణ కోసం 1969లో జరిగిన ఉద్యమంలో దాదాపు 350 మంది అమరులు అయ్యారని పేర్కొన్నారు. నాటి నుంచి తెలంగాణ ఉద్యమం అనేక విధాలుగా జరిగిందన్నారు. ఎంతోమంది యువకులు ప్రాణత్యాగం, ఆమరణ దీక్షలు, సకల జనుల సమ్మె, బందలు, రాస్తారోకోతో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని తెలిపారు.

**ప్రజా పాలనతో ప్రజల వద్దకు..**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజా పాలనతో ప్రజల వద్దకు పాలన చేరవ చేస్తున్నట్లు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ఇప్పటి వరకు రాష్ట్రంలో 87.12 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేసినట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా సూర్యాపేట జిల్లాలో 2 కోట్ల 36 లక్షల 64 వేల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10లక్షలకు పెంచడంతో జిల్లాలో 21,295 మంది పేదలు చికిత్స పొందారన్నారు. రూ.500 వంట సిలిండర్ పథకంలో భాగంగా జిల్లాలో 1.48 లక్షల మందికి లబ్ధి చేకూరిందని, ఇప్పటివరకు రూ. 8.24 కోట్లు సబ్సిడీ అందించడం జరిగిందని పేర్కొన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం ద్వారా జిల్లాలో 1,69,326 మంది లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. రుణమాఫీలో భాగంగా లక్షా 545 మంది రైతుల ఖాతాలో రూ.838.69 కోట్లను ప్రభుత్వం జమ చేసినట్లు చెప్పారు. రైతు భరోసా విధివిధానాలు త్వరలోనే ప్రకటించి అమలు చేయనున్నట్లు తెలిపారు. సన్న వడ్లు పండించే ప్రతి రైతుకూ క్వింటాకు రూ.500 బోనస్ ఈ వానకాలం నుంచి అందించనున్నట్లు పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా జిల్లాలో 571 పాఠశాలలను గుర్తించి రూ.20.18 కోట్లతో మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. అంతకుముందు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, జడ్పీ సీఈఓ అప్పారావు, డీఏ ఫ్‌ఓ సతీశ్‌కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు**

ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. చివ్వెంల జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఏకపాత్రాభినయాలతో అలరించారు అంబేద్కర్ పాత్ర వేసిన బెన్ని పాల్, చాకలి ఐలమ్మగా ప్రదర్శన ఇచ్చిన శశికను నిరంజన్ అభినందించారు. జిల్లాకేంద్రానికి చెందిన శ్లోక, శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ శాఖలకు చెందిన స్టాల్స్‌ను ప్రముఖులు సందర్శించారు. సమాచార పౌర సంబంధాల శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను నిరంజన్ ప్రారంభించి అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫొటోలను వీక్షించారు. అనంతరం పలువురు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులను ఘనంగా సన్మానించారు.


సూర్యాపేట కలెక్టరేట్‌లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

# నేడు జిల్లాకు గోదావరి జలాలు

తిరుమలగిరి, సెప్టెంబర్ 17 : ఎస్సారెస్పీ కాల్వల ద్వారా బుధవారం గోదావరి జలాలను విడుదల చేయనున్నట్లు డీఈ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11:30 గంటలకు జనగామ జిల్లా కొడకండ్ల మండలంలోని బయ్యన్న వాగు రిజర్వాయర్ వద్ద ఎమ్మెల్యే మందుల సామేల్ ఇరిగేషన్ అధికారులతో కలిసి గోదావరి జలాలను విడుదల చేస్తారని పేర్కొన్నారు. తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజక వర్గాల్లో పంటలకు గోదావరి జలాలు అందుతాయని తెలిపారు.

# రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు బీసీ గురుకుల విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజశేఖర్


నందికొండ, సెప్టెంబర్ 17 : సౌత్ జోన్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని బీసీ గురుకుల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించి మాట్లాడారు. ఈ నెల 14న నల్లగొండలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ 14 విభాగంలో ఎం. గణేశ్, అండర్ 18 విభాగం 100 మీటర్ల పరుగులో ఎం. చందు, అండర్ 20లో జె. తరుణ్, 1500 మీటర్ల పరుగులో శివ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీంద్రాచారి, ఏటీపీ గాయత్రి, మాధవీలత, పీడీలు విజయ్, అరుణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనంలో అపశృతి

చెరువులో పడి యువకుడు మృతి

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 17 : వినాయక నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకుంది. చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. ఈ సంఘటన మండలంలోని జిబ్లక్‌పల్లి గ్రామంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిబ్లక్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహానికి సోమవారం రాత్రి శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌లో ప్రైవేటు జాబ్ చేస్తున్న గ్రామానికి చెందిన పబ్బతిగాని ప్రవీణ్ (27) వచ్చాడు. శోభాయాత్ర అనంతరం గ్రామ శివారులోని ఊర చెరువులో నిమజ్జనం చేసేందుకు వెళ్లారు. విగ్రహంతో కొంతమంది చెరువులోకి వెళ్లగా.. పబ్బతిగాని ప్రవీణ్, సన్నీ, బన్నీ, మల్లేశ్ కూడా ఈత రాకపోయినా చెరువులోకి దిగారు. వారిని గమనించిన స్నేహితులు ప్రవీణ్ మినహా ముగ్గురిని బయటికి తీసుకొచ్చారు. కొద్దిసేపటి తర్వాత ప్రవీణ్ లేడని మిత్రులు తెలపడంతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. అడుగుబట్టిన ప్రవీణ్‌ను వెలికి తీయగా.. అప్పటికే మృతిచెందాడు. చెరువులో గుంతలు ఉండడంతో నీటిలో మునిగి మృతిచెందినట్టు భావిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రవీణ్ కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.భాస్కర్‌రెడ్డి తెలిపారు.


జిబ్లక్‌పల్లి గ్రామంలో పబ్బతిగాని ప్రవీణ్ మృతితో విలపిస్తున్న కుటుంబ సభ్యులు బంధువులు


ప్రవీణ్ (ఫైల్)

# ప్రభుత్వ వైఫల్యంతో రైతులకు ఇబ్బందులు

నీళ్లు లేక వేల ఎకరాలు ఎండిపోయే పరిస్థితి

మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

ఎండిన పంట పొలాల పరిశీలన

## కాల్వ గండ్లు పూడ్చేదెప్పుడు..? నీళ్లు వచ్చేదెప్పుడు?

కోదాడ రూరల్, సెప్టెంబర్17 : వానలు, వరదకు పంటలు మునిగింది గోరంత అయితే, కాల్వలకు నీళ్లు రాక ఎండుతున్నవి కొండంత అని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. సాగర్ ఎడమ కాల్వకు గండ్లు పడి 14 రోజులు కావస్తున్నా నేటికీ పనులు ప్రారంభించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నదని మండిపడ్డారు. కాల్వకు నీటి విడుదల లేక వేలాది ఎకరాల పంట ఎండిపోయే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కోదాడ మండలం గణపవరం, తొగర్రాయి, బీక్యాతండా, ఎర్రవరం, రామలక్ష్మీపురం గ్రామాల్లో మంగళవారం ఆయన నీళ్లు లేక ఎండిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రులు ప్రజా సమస్యలను గాలికి వదలేసి కార్లలో షికార్లు చేస్తున్నారని విమర్శించారు. గండ్లు పూడ్చడానికి టెండర్ల పేరుతో కాలయాపన చేస్తున్నారని, సాగర్ నిండా నీళ్లు ఉన్నా పంటలను బతికించుకోలేని పరిస్థితిలో రైతాంగం ఉన్నదని తెలిపారు. గండ్లను యుద్ధ ప్రాతిపదికన పూడ్చి నీటి విడుదలకు చర్యలు తీసుకోకుంటే ప్రజా ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మాజీ మండల కో ఆప్షన్ సభ్యుడు ఎస్కే ఉద్దండు, మాజీ సర్పంచులు పొట్ట విజయకిరణ్, దొంగల లక్ష్మీనారాయణ, అన్నెం వెంకట్‌రెడ్డి, అమరబోయిన శ్రీనివాస్‌యాదవ్, గంటా శ్రీనివాస్, పోశం పూర్ణయ్య, కత్తి వెంకటేశ్వరావు, కత్తి రంగారావు, రైతులు పాల్గొన్నారు.

**మాట తప్పిన ఉత్తమ్**

అనంతగిరి : సాగర్ ఎడమ కాల్వకు నీళ్లు రాక ఎండుతున్న అనంతగిరి మండలంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పర్యటించారు. నీటి పారుదల శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలో రైతుల పంటలు ఎండిపోతున్నాయని ఆయన అన్నారు. వారంలో గండి పూడుస్తామని చెప్పిన ఉత్తమ్ 14 రోజులైనా మాట నిలబెట్టుకోలేక పోయారని దుయ్యబట్టారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నల్లా భూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుగులోతు శ్రీనివాస్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు గండూరి సంతోష్, పందిరి వీరయ్య, సైదా, భూక్యా బోసు, మట్టపల్లి సైదులు, ప్రసాద్, శ్రీనివాస్, కమల్ ఉన్నారు.


కోదాడ మండలం గణపవరంలో ఎండిన పంట పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

**పొలంపై ఆశలు వదులుకోవాల్సిందే..**

రైతుబంధు రాకున్నా అప్పు చేసి పొలం నాటు బెట్టిన. సాగర్ నీటితో నా పొలం పులక పారలేదు. గండ్లతో నీరు బంద్ కావడంతో పొలం ఎండిపోతున్నది. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకున్నట్లయితే పంటలు చేతికి వచ్చేవి. కానీ 14 రోజులవుతున్నా గండ్లు పూడ్చివేత పనులు ప్రారంభించకపోవడంతో పొలంపై ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

**-పోశం పూర్ణయ్య, రైతు, గణపవరం**



**గతంలో వారం రోజుల్లోనే గండ్లు పూడ్చారు**

సాగర్ కాల్వకు గండ్లు పడటం కొత్త కాదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హాలియా వద్ద పెద్ద గండి పడింది. తక్షణమే స్పందించిన కేసీఆర్ సార్ పనులు ప్రారంభించి నీళ్లందించారు. ఒక్క ఎకరం కూడా ఎండకుండా కాపాడారు. కాల్వకు గండ్లు పడి రెండు వారాలవుతున్నా పనులే మొదలు పెట్టలే. ప్రభుత్వానికి నీళ్లు ఇచ్చే విధానంపై సరైన ప్రణాళిక లేదు.

**- కత్తి వెంకటేశ్వరావు, రైతు, కోదాడ**

